## 25న కాళీమాత దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన


కాళీ మాత విగ్రహం

**వెల్దుర్తి, డిసెంబర్23 (ప్రభాతవార్త):** ఈ నెల 25వ తేదీన వెల్దుర్తి మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామ శివారులో కాళీమాత దేవాలయ శంకుస్థాపన జరుగుతుందని కాళీ మాత మందిర వ్యవస్థాపకులు సత్యనారాయణ తెలిపారు. విఠల్ స్వామి పర్యవేక్షణలో అమ్మవారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారని, డాక్టర్ నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుదన్నారు. తెలంగాణలో ఎక్కడా లేనివిధంగా అతిపెద్ద కాళీమాత విగ్రహం(13 ఫీట్లు) మన్నెవారి జలాల్‌పూర్‌లో ప్రతిష్ఠించడం జరుగుతుందన్నారు. ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని వనిజయవంతం చేయాలని ఆయన కోరారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త


## దత్త జయంతి ఉత్సవాలకు ముస్తాబైన ఆశ్రమం

### నేటి నుంచి దత్త యజ్ఞాలు...ఉత్సవాలకు కాశీ జగద్గురు రాక

**ఝరాసంగం, డిసెంబరు 23, (ప్రభాతవార్త):** మండలంలోని బర్దీపూర్ గ్రామంలోని శ్రీదత్తగిరి ఆశ్రమం ఉత్సవాలకు ముస్తాబయింది. ఈ నెల 26న మార్గశిర పౌర్ణమి పర్వదినాన శ్రీదత్తజయంతి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖామణి 108 అవధూత గిరి మహారాజ్(అప్పగారు), డాక్టర సిద్దేశ్వర స్వామి, మాతృశ్రీ అనసూయ మాతల ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు 21 యజ్ఞ గుండములతో శ్రీదత్త యజ్ఞాలు, లోక కళ్యాణార్థం శ్రీచండీ హోమాలు మూడు రోజుల పాటు భక్తి శ్రద్దల నడుమ కొనసాగనున్నాయి. ఆశ్రమాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆశ్రమానికి వచ్చే భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మండల కేంద్రమైన ఝరాసంగంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకున్నారు. ఝరాసంగం ఎస్ఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆశ్రమ పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఐ రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.


సైకిలింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

## క్రీడల్లో చురుగ్గా పాల్గొని ఆరోగ్యంగా ఉండాలి

### జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**చిన్నకోడూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** ఆటలలో చురుగ్గా పాల్గొంటే.. ఆరోగ్యంగా ఉంటారని..ఆలోచన శక్తి పెరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలపరిధిలోని రంగనాయక సాగర్‌పై శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి 8వ రోడ్ సైకిలింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆయన మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజులరాజనర్సు, డివైఎస్‌ఓ నాగేందర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలు మంచి నడవడి నేర్చుకోవాలన్నారు. పిల్లలకు అసక్తి ఉన్న రంగాలపై తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు. విద్యార్థులు క్రీడలతోపాటు విద్యలో ముందుండాలన్నారు. సైకిలింగ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సిద్దిపేట రైస్ మిల్లర్ సంఘం తరపున జిల్లా అడిషనల్ కలెక్టర్ నూతన సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో రైస్ మిల్లు సంఘం అధ్యక్షులు బాలకిషన్, సైకిలింగ్ జిల్లా అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాస్, ఇంటర్ నేషనల్ కోచ్ మ్యాక్స్ వెల్, కార్యదర్శి వెంకటనర్సయ్య, రాష్ట్ర సైకిలింగ్ కార్యదర్శి విజయకాంతారావు, సిద్దిపేట కోచ్‌లు సుజాత, రవీందర్‌రెడ్డి, నాయకులు కాస రవి తదితరులు పాల్గొన్నారు.

## రంగనాథస్వామి ఆలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక పూజలు


రంగనాథస్వామి ఆలయంలో పూజలుచేస్తున్న దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌రాజనర్సింహ అందోలులోని భూనీలసమేత రంగనాథ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆయన రంగనాథస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. వేకువ జామునే ఆలయంలో ఈ పూజలు చేపట్టారు. మంత్రి పూజలు చేయడానికి విచ్చేసిన సందర్భంగా ఆలయ పూజారులు మంత్రి దామోదర్ రాజనర్సింహకు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఉత్తరద్వార దర్శనం చేసకున్నారు అనంతరం మంత్రిని శేసవస్త్రాలతో సన్మానించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహను కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పాండు, కౌన్సిలర్లు సురెందర్‌గౌడ్, రంగసురేష్‌గుప్త, డాకూరి శంకర్, కొరబోయన నాగరాజు(నాని), పట్లోల్ల రేఖాప్రవీన్, హరిక్రిష్ణ గౌడ్, కోఆప్షన్ సభ్యులు అల్లెశ్రీకాంత్, మాజీ ఎంపిటిసి డాకూరి వెంకటేశ్, మండల పార్టీ అధ్యక్షులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

### -జిల్లా ఎస్పి రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 23, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పి సిహెచ్ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలు, ఫోక్సో యన్‌డిపియస్ యాక్ట్, సిసిటియన్‌ఎస్-2.0పై ఒక రోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. నేరాల అదుపుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తూ ప్రజల అప్రమత్తతపై పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ అత్యాశకు పోయి అనవసరంగా సైబర్ నేరాల బారిన పడవద్దని సూచించారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్సీ అందుబాటులో ఉన్న ఈ తరుణంలో టెక్నాలజీని వాడుకుని మరిన్ని మోసాలకు చేసేందుకు అవకాశాలు ఉన్నాయని, అందుకు ప్రతి ఒక్కరు గుర్తు తెలియని వారితో అతిగా సంబాషిచవద్దని, ఫోన్‌లో లింక్‌లపై స్పందించవద్దని, జాగ్రత్తలు పాటిస్తేనే సైబర్ నేరాలకు గురికాకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. సైబర్ నేరాలకు గురైతే 48 గంటల్లోపు 1930కుకాల్ చేసి లేదా యన్‌సిఆర్‌బి పోర్టల్ నుందు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. న్యాయమూర్తి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ పూర్వం కృతయుగంలో రాక్షసుడు దేవాలను దొంగిలించినందుకు యుద్ధాలు, త్రేతాయుగంలో స్త్రీ గురించి యుద్ధాలు, ద్వాపరయుగంలో రాజ్యం గురించి యుద్ధాలు, ఇప్పుడు కలియుగంలో అన్ని రకాలు మోసాలు (అధికారం, స్త్రీ, డబ్బులు తదితర) మోసాలు జరగే అవకాశాలు ఉన్నాయని, అందుకు ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు న్యాయమూర్తి ప్రభాకర్‌రావు, అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి రాధాకృష్ణ చవాన్, యంయం ముబైలు కోర్టు న్యాయమూర్తి, పిపిలు, జుడిషియల్ అధికారులు, సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిఐలు, ఎస్‌హెచ్‌ఓలు, కోర్టు కానిస్టేబుల్‌లు, స్టేసన్ రైటర్లు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు

**వెల్దుర్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా, ముగ్గురు ఫిర్యాదు చేయడం జరిగిందని విద్యుత్ ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. మానెపల్లి గ్రామానికి చెందిన నర్సింలు, ప్రభుగౌడ్‌లు దరఖాస్తులు సమర్పించారు. ప్రభు అనే రైతు గతంలో విద్యుత్ సౌకర్యానికి విధించిన జరిమానాలు చెల్లించినప్పటికీ తమ విద్యుత్ బిల్లులో జరిమానా చెల్లించలేదని వస్తుందని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరగా, పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లరావు

# ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి కమల్‌వర్ధన్‌రావు.. రంగంపేట, సంగాయిపేట గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

**కొల్చారం, డిసెంబర్ 23 ప్రభాతవార్త:**

ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి కమల్‌వర్ధన్‌రావు అన్నారు. వికసిత్ భారత్ యాత్రలో పాల్గొనడానికి వచ్చిన కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి కమల్‌వర్ధన్‌రావుకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా గౌరవ పూర్వకంగా ఆహ్వానం పలికారు. శనివారం కొల్చారం మండల పరిధిలోని రంగంపేట,సంగాయిపేట గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు బండి సుజాత రమేష్, పాశం మానస శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారిన ఆహారపు అలవాట్ల కారణంగా ఆరోగ్య సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారన్నారు. ఆరోగ్య సమస్య పరిష్కారం కోసం కేంద్రప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం అందించడంకోసం కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషణ అభియాన్ కార్యక్రమం ద్వారా గర్భిణీలు బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా 1632 ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కిసాన్ సమృద్ధి యోజనద్వారా ప్రతి ఏడాది మూడు విడతల్లో ఒక్కో రైతుకు 6000 ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. మహిళలు, రైతులు, విద్యార్థులు ఇలా అన్ని రకాల ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలల్లో హెల్త్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. దానికి మహిళలే ముందుకు రావాలని సూచించారు. ఉజ్వల్ యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు మహిళలకు అందజేస్తున్నట్లు తెలిపారు. పది సంవత్సరాల కాలంలో కేంద్ర ప్రభుత్వ పథకాల కారణంగా దేశంలో గ్రామస్థాయి నుండి అనేక మార్పులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలతో గ్రామస్థాయిలో అమలవుతున్న వివిధ పథకాలపై ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అంగన్వాడీ కేంద్రాల తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి ఎక్కువగా పేదలు వస్తారని, అత్యవసరమైన మెడిసిన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి ఏరియా ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన పరీక్షలు చేయడానికి ఈసీజీ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వికసిత్ భారత్ యాత్ర ఈ నెల 16న ప్రారంభమైందని, వచ్చే నెల 24 జనవరి 2024వరకు కొనసాగుతుందని, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరాలన్నదే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ నెల 28 నుండి గ్రామ సభల ద్వారా రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరించబడతాయని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రాజేశం, డీఎంహెచ్‌వో డాక్టర్ చందునాయక్, వ్యవసాయశాఖ ఏడీ పుణ్యవతి, సర్పంచులు బండి సుజాత రమేష్, పాశం మానస శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ గఫార్ మియా, ఐకేపీ డీపీఎం జాన్ కెనడీ, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎంపీవో నర్సింలు, వ్యవసాయాధికారి శ్వేత కుమారి, ఏపీవో మహిపాల్‌రెడ్డి, ఏపీఎం దేవ సుశిల్వ, కార్యదర్శులు నగేష్, ప్రియాంక, ఏఈవో నిరోశ, రంగంపేట ఎస్‌బీహెచ్ మేనేజర్ శౌరి ప్రసాద్ పాల్గొన్నారు.


ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి కమల్‌వర్ధన్‌రావు

# పీహెచ్‌సీలలో వైద్యులను నియమించాలి

**మెదక్ అర్బన్, డిసెంబర్ 23 ప్రభాతవార్త:**

మెదక్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హేమలత శేఖర్ గౌడ్ అధ్యక్షతన జిల్లాపరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో వైద్య ఆరోగ్య, విద్య, వ్యవసాయ, విద్యుత్ శాఖ, పౌర సరఫరాల శాఖ, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ, ఆర్టీసీ, మైనింగ్, వెటర్నరీ శాఖలపై సమీక్ష జరిగింది.

**వైద్యశాఖ..** జిల్లాలోని పీహెచ్‌సీ సెంటర్లలో వైద్యులను నియమించాలని, జన వికాస్ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ.. రైతు బంధు ఇంకా ఎప్పటి వరకు ఇస్తారో తెలియజేయాలని అధికారులను కోరారు.

**విద్యా శాఖ..** విద్యాశాఖలో వివిధ మండలాలకు డిప్యూటేషన్‌లను కాన్సిల్ చేసేలా చర్యలు తీసుకోవాలని, మనబడి కార్యక్రమం ద్వారా పనులు చేసిన డబ్బులు రాక ఇబ్బంది పడుతున్నారని, కొంత డబ్బులు వచ్చిన కొన్ని గ్రామాల్లో కొంద మంది అధికారుల నిర్లక్ష్యం వల్ల నిధులు విడుదల కావట్లేదని వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుత్ శాఖ.. ఒకరిద్దరు రైతులు బిల్లులు కట్టకపోతే ట్రాన్స్‌ఫార్మర్ నుండి పవర్ సప్లై విడుదల చేయకపోవడం వల్ల మిగిలిన రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ సప్లైపై ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. పశువులు చనిపోతున్నా విద్యుత్ శాఖ అధికారుల్లో మార్పు రాకపోవడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**పౌరసరఫరాల శాఖ..**

జిల్లా పౌరసరఫరాల శాఖలో రేషన్ షాప్‌లకు ఖచ్చితమైన సమయంలో సరుకులు ఇవ్వాలని, ప్రతి గ్రామంలో రేషన్ బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజాప్రతినిధులు కోరారు. జిల్లాలో గోనె సంచుల కుంభకోణంపై, పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టిందనే కథనంపై ఏం చర్యలు తీసుకున్నారని సభ్యులు అడగగా దాదాపు 7 కోట్ల బియ్యం, గోనె సంచులు పక్కదా పట్టాయని, వాటిపై విచారణ జరుగుతుందని సివిల్ సప్లై అధికారులు తెలిపారు.

**పంచాయతీరాజ్ శాఖ..** పంచాయతీరాజ్ అధికారులు ఉత్తర్వుల్లో మంజూరైన స్థలంలో కాకుండా వేరే స్థలంలో పనులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్‌రూంల బిల్లులు త్వరగా వచ్చేలా ఎంబీ రికార్డు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ.. స్కూల్ విద్యార్థులకు బస్‌లు సకాలంలో నడిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం వల్ల ఎక్కువ బస్సులను పెంచాలని అధికారులను కోరడం జరిగింది. శంకరంపేట (ఆ) ప్రాంతంలో బస్ సౌకర్యం కల్పించకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో, రిక్షా కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరడం జరిగింది. కేజీవీల్ ట్రాక్టర్‌లు రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మెదక్ జిల్లా చార్మినార్ జోన్‌లో కలపాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎస్‌డీఎఫ్ ద్వారా మంజూరైన నిధులను కాన్సిల్ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని ఏకగ్రీవంగా తీర్మాణించారు. ఎన్‌ఎస్‌ఎఫ్ ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

వికలాంగులందరికీ కూడా ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని, ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రమేష్, జెడ్పీ సీఈవో వెంకట శైలేష్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో సభ్యులు



సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్

## విద్యుదాఘాతంతో రైతు మృతి

**పాపన్నపేట, డిసెంబరు 23, ప్రభాతవార్త:** వరి తూకంను కాపాడేందుకు వేసిన కరెంట్ తీగను తాకడంతో విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఎల్లాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పట్నం శంకరయ్య (61) తనకు చెందిన పొలంలో అడవి పందుల నుంచి వరి తూకంను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలను అమర్చుకున్నాడన్నారు. పొలం వద్దకు వెళ్లిన శంకరయ్య ప్రమాదావశాస్తు విద్యుత్ తీగలను తాకడంతో ప్రమాదం చోటు చేసుకుంది. శంకరయ్య అక్కడికి అక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి కుమారుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి వివరించారు.

# పెండింగ్ పనులకు ఎవరిది బాధ్యత ?

### ◆ నిధులు విడుదలైనా పనులు చేతకాలే ◆ మున్సిపల్ పాలకవర్గం నిర్లక్ష్యమే కారణమా?

**గజ్వేల్, డిసెంబర్ 23 (ప్రభాతవార్త):**

మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో అభివృద్ధి పనులకు గతంలో అనేక నిధులు మంజూరైన విషయం తెలిసిందే. మున్సిపల్ పరిధిలో ఉన్న 20 వార్డుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్లతోపాటు వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతుండగా నవంబర్‌లో ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జరుగుతున్న పనులకు బ్రేక్ పడింది. అయితే నిధులు మంజూరు అయినప్పటికీ పనులను పూర్తి చేయడంలేదు. మున్సిపల్ నూతన పాలకవర్గం ఏర్పడి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా ఇందులో కరోనా సమయంలో రెండు సంవత్సరాలు వృధా కాగా ఇటీవల పాలకవర్గ సభ్యులు మున్సిపల్ చైర్మన్ విషయంలో అవిశ్వాసం తీసుకురావడంతో ఒక సంవత్సరంపాటు అభివృద్ధి కుంటుపడింది. మున్సిపల్‌లో అభివృద్ధి పనులు తుదిదశలో ఉన్నప్పటికీ పాలకవర్గం నిర్లక్ష్యం వల్ల పనులు జరగడంలేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం అందరూ కలిసికట్టుగా ఉండి వచ్చిన నిధులను వినియోగించి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**మండలాల్లోనూ ఇదే పరిస్థితి...**

గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల్లోనూ అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తి చేయలేకపోయారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని మండలాలకు నిధులు కేటాయించగా పలు గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు, శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు అసంపూర్తిగా ఉండగా మరికొన్నిచోట్ల పూర్తయ్యాయి. ఏది ఏమైనా గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం పూర్తి కాబోతున్న సందర్భంగా అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం


వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటున్న ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు

## వైభవంగా వైకుంఠ ద్వార దర్శనం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

సిద్దిపేట మోహినిపుర వెంకటేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం పురస్కరించుకొని శనివారం భక్తులతో కిటకిటలాడి ంది. వేల సంఖ్యలో భక్తులు వైకుంఠ ద్వారం ద్వారా ఉత్సవ మూర్తులను దర్శనం చేసుకున్నారు. ఉదయం 5 గంటల నుంచే ఆలయ ఆవరణలో వేలాది మంది భక్తులు బారులు తీరి నిలబడ్డారు. 5 గంటల ప్రాంతంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం భక్తులు వైకుంఠ ద్వారం ద్వారా శ్రీవారిని, అమ్మవారిని, గోదాదేవిని దర్శించుకున్నారు. గంటల తరబడి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుతో పాటు మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజుల రాజనర్సు, ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయపక్షాన హరీష్‌రావుతోపాటు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వన్‌టౌన్ సిఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బందో బస్తు ఏర్పాటు చేశారు. వైకుంఠ నాథుని కృపా కటాక్షంతో ప్రజలంత సంతోషంగా ఉండాలి

## ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి

### ఎమ్మెల్యే హరీష్‌రావు

స్వామి దయతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం సిద్దిపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, పారుపల్లి వీధిలో గల పాత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైష్ణవ అలయాల్లో వైకుంఠ ఏకాదశి వైభవంగా జరిగిందన్నారు. ఈ పర్వదినం ఉత్తర ద్వారా దర్శనం ప్రత్యేకత అని అన్నారు. రాష్ట్రంలో కరోనా లాంటి మహమ్మారిలు ప్రభలకుండా చూడాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారి అశీస్సులు తీసుకున్నారు. అలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి హరీష్‌రావుకు అశీర్వాదం ఇచ్చారు. కాగా గణేష్‌నగర్ హనుమాన్ దేవాలయంలో తూర్పు ద్వారం ప్రారంభించారు. అనంతరం అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ నిర్వాహకులు అయనను ఘనంగా సత్కరించారు.

**ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలి**

**సిద్దిపేట రూరల్/ నంగునూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :**

ప్రజలందరూ సుఖసంతోషాలతో అయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని నంగునూర్ శ్రీ వెంకటేశ్వర స్వామి అలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైష్ణవాలయాల్లో వైకుంఠ ఏకాదశి వైభవంగా జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, కోల రమేష్‌గౌడ్, కోల మహేందర్‌గౌడ్, చలికాని మల్లేశం, జైపాల్‌రెడ్డి, బాల పోచయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**పుల్లూరులో...**

ఉత్తర ద్వారం గుండా లక్ష్మీ వల్లభుడిని దర్శించుకున్న భక్తులు సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండ స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం 4 గంటల నుంచే వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామికి, వెంకటేశ్వర స్వామి మూల విరాట్టుకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పవిత్ర ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి విరచిత తిరుప్పావై దివ్య ప్రబంధ పాశురాలను గానం చేశారు. అనంతరం శావపై లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి దేవాలయం నుంచి బయటకు తీసుకు వచ్చి బండపై ఊరేగించారు. దేవాలయం ఉత్తర ద్వారం గుండా ఉత్సవ మూర్తులను తిరిగి దేవాలయం గర్భ గుడిలోకి తీసుకు వచ్చి భక్తుల దర్శనార్థం ఉంచారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనానికి అనుమతించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో దేవాలయ వంశ పారంపర్య అర్చకులు పొడిచేటి శ్రీనివాసా చార్యులు, కలకుంట్ల రంగాచార్యులు, పొడిచేటి రామకృష్ణమా చార్యులు, వేణుగోపాలా చార్యులు, గ్రామ సర్పంచ్ నరేష్‌గౌడ్, దుర్గారెడ్డి, గడ్డం తిరుపతిరెడ్డి, జిల్లెల సుధాకర్, ఒగ్గు మురళి, కోడూరి శ్రీనివాస్, బండచర్లపల్లి సర్పంచ్ దశరథం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన వైష్ణవ దేవాలయాలు

**కొల్చారం, డిసెంబర్23 ప్రభాతవార్త:**

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం కొల్చారం మండల వ్యాప్తంగా భక్తులతో కిటకిటలాడిన వైష్ణవ దేవాలయాలు. మండల పరిధిలోని రంగంపేట గ్రామంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్న భక్తులు. కొల్చారం మండల వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైష్ణవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సంగాయిపేట గ్రామంలో శ్రీ వెంకటేశ్వర ఆలయం, రంగంపేట గ్రామంలో రంగనాయ స్వామి ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాలను పూలు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం రంగంపేట, సంగాయిపేట గ్రామాల్లోని రంగనాయక స్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి స్వామివారికి ప్రత్యే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీనివాసుడిని వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకుంటే స్వామివారి దీవెనలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు నాగరాజు శర్మ, కుమార శ్మ, ఎంపీపీ మంజుల కాశీనాథ్, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, మాందాపూర్ జనార్ధన్‌రెడ్డి, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పల్గొన్నారు.





భగవద్గీత పుస్తకాలను పంపిణీచేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

## భగవద్గీత పుస్తకాల పంపిణీ

**గజ్వేల్ టౌన్, డిసెంబర్ 23 (ప్రభాతవార్త):** గీత జయంతిని పురస్కరించుకుని శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం శ్రీమురళీకృష్ణాలయంలో భగవద్గీతపుస్తకాలను భక్తులకు ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ గీత మనిషిలోని నిరాశను పోగొట్టి ఆశాజీవిగా మారుస్తుందన్నారు. ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్న రామకోటి రామరాజు ధన్యుడని తెలిపారు. నేటి బిజీ ప్రపంచంలో కూడా భక్తిని ప్రేరేపించి యువతీ, యువకులనే కాకుండా వృద్ధులను రామకోటి రాయించడం ఆయన భక్తికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత అధ్యక్షుడు ఆకుల నరేష్‌బాబు, కృష్ణాలయం అధ్యక్షుడు ఎలగందుల రామచంద్రం, ఉప్పల వెంకటేశం, దూబకుంట మైత్రాములు, అత్తెల్లి లక్ష్మయ్య, అంతునూరి శివకుమార్, తుమ్మ మల్లేశం, దొంతుల దశరథం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** క్రిస్మస్ వేడుకులను పురస్కరించుకొని ముందస్తుగా శనివారం సిద్దిపేటలోని మెడికేర్ రిచ్ అసుపత్రితోపాటు అర్బన్ మండలంలోని అయా గ్రామాల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో మెడికే రిచ్ అసుపత్రి వైద్యులు అనంద్‌రాజ్, రాజ్‌నీష్, కిషోర్, త్రివిక్రమ్, పర్శరాములు, తాజుద్దీన్, ఇమ్రాన్, అసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సుడా చైర్మన్ పదవి దళితునికే కేటాయించాలి



మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎల్లేష్

**సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** సిద్దిపేట సుడా చైర్మన్ పదవి దళితులకు కేటాయిస్తేనే న్యాయబద్ధంగా ఉంటుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జంజీరప ఎల్లేష్ అన్నారు. శనివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ ఎన్ని కష్టాలువచ్చినా ఇబ్బందులు ఎదురైనా కాంగ్రెస్ పార్టీకి నమ్మిన బంటుగా పనిచేస్తున్న దళిత నాయకులు బొమ్మల యాదగిరికి సుడా చైర్మన్ పదవి కేటాయించాలని పార్టీ అధిష్టానంతో పాటు సిఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులకు విజ్ఞప్తి చేశారు. దళితులకు నామినేటెడ్ పోస్టులలో ప్రాముఖ్యత కల్పించడం వల్ల కాంగ్రెస్ దళితుల పక్షపాతి అని నిరూపించుకోవాలన్నారు. సుడా చైర్మన్ పదవి దళితుడైనా బొమ్మల యాదగిరికి కేటాయించి ప్రభుత్వం న్యాయంచేయాలని విజ్ఞప్తిచేశారు. సమావేశంలో నరసింగరావు, విజయ్, రాజు, బాబు, అజయ్, రాకేష్, అంజనేయులు, మహేష్, సందీప్,వంశీ, నర్సింలు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్‌లో గీతా జయంతి శోభాయాత్ర



న్యాల్‌కల్‌లో గీతా జయంతి శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, డిసెంబరు 23, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శనివారం గీతా జయంతి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం గ్రామంలోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిలో భగవద్గీతను ప్రతిష్టించుకుని న్యాల్‌కల్-బీదర్ రోడ్డులోని శ్రీసాయిబాబా ఆలయం వరకు గ్రామ పురవీధుల గుండా భక్తులు దైవాన్ని స్మరిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలో ఇళ్ల ముందుకు చేరుకున్న పల్లకి సేవను భక్తులు దర్శించుకున్నారు. పల్లకి సేవతో సాయిబాబ ఆలయానికి చేరుకుని సాయినాథుడి సన్నిదిలో పూజలు నిర్వహించి సామూహిక గీతా పారాయణం నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన పల్లకి సేవ ఊరేగింపు గ్రామస్థులను ఆకట్టుకుంది.

## మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలి

**నారాయణఖేడ్, డిసెంబర్ 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలో నూతనంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలని ధర్మసమాజ్ పార్టీ నారాయణఖేడ్ నియోజకవర్గ ఇంఛార్జి అలిగే జీవన్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం నారాయణఖేడ్ ఆర్డీఓ కార్యాలయంలో ధర్మ సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో ఆర్‌డీఓ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని తెల్లరేష్షన్‌కార్డులు ఉన్న పేదలకు మాత్రమే అవకాశం కల్పించి ధనవంతులైన మహిళలకు ఉచిత ప్రయాణాన్ని నియంత్రించాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి నెల రూ.లక్ష సంపాదించే మహిళా ఉద్యోగులకు ఉచిత ప్రయాణాన్ని రద్దుచేసి పేదలైన ఇంటిని పోషించే పురుషులకు కూడా ఉచిత ప్రయాణం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉచిత ప్రయాణం ప్రభావం ఆటో కార్మికులపై పడి ఆటో కార్మికులు తీవ్రగా నష్టపోతున్నారని ఆటో నడిపే కార్మికులకు ప్రతి ఒక్కరికి నెలకు రూ.3వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, ప్రవీన్, అశోక్, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.





ఆర్డీఓకు వినతి పత్రాన్ని అందజేస్తున్న జీవన్‌కుమార్ తదితరులు

# పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

**మండల సర్వసభ్య సమవేశంలో ఎంపిపి గిరిధర్‌రెడ్డి**





మాట్లాడుతున్న ఎంపిపి గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, డిసెంబరు 23, ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, బద్దకస్తం వహిస్తే బదిలీలు తప్పవని ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రానున్న మూడుమాసాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు అధికారులు సహకరించాలన్నారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఒక ఎకరం వరకు ఉన్న రైతులకు రైతు బంధు డబ్బులను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేయడం జరిగిందని, మిగిలిన వారికి త్వరలోనే రైతు బంధును అందచేస్తామన్నారు. మొగుడంపల్లి పిహెచ్‌సి వైద్యులు సీతారామరాజు మాట్లాడుతూ పిహెచ్‌సి పరిధిలోని పలు గ్రామాలు జహీరాబాద్ మండలంలో ఉన్నాయని, ఫలితంగా చికిత్స నిమిత్తం మొగుడంపల్లికి వచ్చేందుకు ప్రజలు పాట్లు పడుతున్నారని గుర్తు చేశారు. జహీరాబాద్‌లో నూతన పిహెచ్‌సి ఏర్పాటుకు కృషి చేయాలని డాక్టర్ సభ దృష్టికి తెచ్చారు. కరోనాను ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని డాక్టర్ వివరించారు. కాశీపూర్, మల్చల్మె గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ఎత్తుకుపోయారని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని మల్చెల్మ సర్పంచ్ పాండురంగారెడ్డిరెడ్డి, ఎంపిపి ఉపాధ్యక్షులు విరాములు పేర్కొన్నారు.

**ఇరిగేషన్ ఏఈపై ఎంపిపి మండిపాటు...**

మండలంలోని శేఖాపూర్, మల్చెల్మ గ్రామాల్లోని చెరువులను బాగు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇరిగేషన్ ఏఈ జానికి రామ్‌పై ఎంపిపి గిరిధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుల తూములు, కట్టలు తెగిపోయి రైతులకు ఇబ్బందులు పడుతున్నారని గత సమావేశాల్లో సభ్యులు సభ దృష్టికి తెచ్చినా తగు చర్యలు తీసుకోకపోవడం పట్ల మండిపడుతూ పనులు చేయకుంటే బదిలీ చేసుకుని వెళ్లిపోవాలని సలహా ఇచ్చారు. ఈ విషయమై ఎంపిపి సభలో నుంచే నీటి పారుదలశాఖ ఎస్సీ తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను అధికారి దృష్టికి తీసుకుపోయారు. షేఖాపూర్, మల్చల్మె గ్రామాల్లో రెవిన్యూ అధికారులు అటవీ శాఖ అధికారులు ఉమ్మడి సర్వే చేయాలని గత సమావేశంలో కోరినా స్పందించడం లేదని విచారం వ్యక్తం చేశారు. జాయింట్ సర్వేకు తహసీల్దార్ తగు చర్యలు తీసుకోవాలని ఎంపిపి సూచించారు.

ఈ కార్యక్రమలో ఎంపిపి ఉపాధ్యక్షులు విరాములు, జడ్పీటిసి సభ్యులు నాగిశెట్టి రాథోడ్, తహసీల్దార్ ఎస్ రవీందర్, ఎంపిడిఓ పి సుమతి, ఎంపిఓ మహేష్, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ నీలకంఠం

## 10 పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : ఎంఇవో

**పాపన్నపేట, డిసెంబరు23, ప్రభాతవార్త:** రానున్న 10వ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మండల విద్యాధికారి నీలకంఠం సూచించారు. మండల కేంద్రమైన పాపన్నపేటలోని ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. 10 విద్యార్థులను గ్రూపుల వారిగా విభజించి గ్రతి లక్ష్యాలను సాధించాలన్నారు. పాఠశాలకు హాజరు కాని విద్యార్థులకై ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు లెసన్ ప్యాన్ రాయా లని, డైరీ నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిం చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ మహేశ్వర్, యూసుఫ్‌పేట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలతిదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ సంబరాలు

**కొండపాక, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** విద్యార్థులు చిన్ననాటి నుండి మంచి అలవాట్లను నేర్చుకున్నట్లయితే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం కుకునూరుపల్లిలోని ఒ ప్రైవేటు పాఠశాలలో క్రిస్మస వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రిస్మస్ వేడుకలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సంరద్భంగా విద్యార్థుల ఆట పాటలను తిలకించి ఎంఈఓ వారిని అభినందించారు. కార్యక్రమంలో పాదర్ విల్‌సన్, పోల్కంపల్లి నరేందర్, పాఠశాల కరస్పాండెంట్ సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

**కొండపాక, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోలు నడిపి జీవించే వాళ్ళ పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ప్రభుత్వం వారిని ఆర్థికంగా అదుకోవాలని శనివారం కుకునూరుపల్లి మండల ఆటో యూనియన్ అధ్యక్షుకు పేర్ల రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఇచ్చినమాట ప్రకారం ఉచిత ప్రయాణం కల్పించరన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో 5 లక్షల ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డునపడ్డాయని, వారు కుటుంబాలను పోషించుకోలేక ఎన్నో రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆటో డ్రైవర్లు సైతం కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారని వివరించారు. ఆటోలు నడవక ఆర్థిక ఇబ్బందులు పడుతు భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటోలు నడపే వారికి ప్రతి నెల రూ॥ 10 వేలు ఫించన్ రూపంలో చెల్లించి అదుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు



సిఎం చిత్ర పటం అందజేస్తున్న దృశ్యం

## సిఎం చిత్రపటాన్ని గ్రామ పంచాయతీకి అందజేత

**నంగునూర్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు రంగు అశోక్ గౌడ్ అధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని పంచాయతీ కార్యదర్శి అనిత, సర్పంచ్ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాములు, ఐలయ్య, రఫిక్, మహేందర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సత్కరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

**మిరుదొడ్డి, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** ఇటీవల దుబ్బాక శాసన సభ్యుడిగా గెలిచిన కొత్త ప్రభాకర్‌రెడ్డి మండల కేంద్రానికి తొలిసారిగా విచ్చేసిన సందర్భంగా ఎంపిపి గజ్జల సాయిలు, జడ్పీటిసి లక్ష్మీలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అలాగే తహశీల్దార్ గోవర్ధన్,ఎంపిడిఓ రాజిరెడ్డి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. మిరుదొడ్డి జర్నలిస్టు అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి పూల బొకే అందించి అభినందించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు వీరేశం, కర్ణాకర్, నరేష్, మహేష్, శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అశ్రిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

**పాపన్నపేట, డిసెంబరు 23, ప్రభాతవార్త:** మండలంలోని నాగ్సన్‌పల్లి గ్రామానికి చెందిన అశ్రిత ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు స్థానిక కాంగ్రెస్ నాయకులతో 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు దండెం సుశీల దుర్గయ్య, పార్ష నర్సింలు, ఇంద్రసేనారెడ్డి, దేవేందర్‌రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన పీఏసీఎస్ చైర్మన్

**శివ్వంపేట, డిసెంబర్23 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కరుణం రాజు, జ్యోతి దంపతుల కుమార్తె వివాహానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి శనివారం 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు జగన్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు సంతోష్‌కుమార్‌ల చేతుల మీదుగా అందజేయడం జరిగింది. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పేదింటి కుటుంబాల్లో జరిగే వివాహాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గారెడ్డి, మధు, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు భూమలింగం, యాదగిరి, కుమార్, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఐజెయు అందోలు నూతన అధ్యక్షుడిగా ఆనంద్‌వర్ధన్

**జోగిపేట, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజెయు) అనుబంధంగా అందోలు జర్నలిస్టు యూనియన్ కార్యవర్గాన్ని శనివారం జోగిపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు వెంకట్ రెడ్డి సమక్షంలో ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి విరాహత్ ఆలి ఆదేశానుసారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటి అధ్యక్షులుగా పి.ఆనంద్‌వర్ధన్, ప్రధాన కార్యదర్శిగా అల్లె మహేష్, కోశాధికారిగా గొర్లకాడి కుమార్, ఉపాధ్యక్షులుగా డాకూరి రాజేష్, అర్షద్, సహాయ కార్యదర్శులుగా పతంగి అశోక్, ఎర్రారం సతీష్, దానంపల్లి సత్యం, ప్రచార కార్యదర్శిగా ఎలగోరి శివకుమార్, సంయుక్త కార్యదర్శులుగా న్యాగరి రాజు, మక్సూద్,ఉల్వలరాజు, లాయక్‌ఆలి, కార్యవర్గసభ్యులుగా వెంకటేశం, సంతోష్‌రావు మరో పదిమంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.





మాట్లాడుతున్న పందిల్ల సర్పంచ్ రమేష్

## పంటలకు కంపోస్టు ఎరువులు వాడాలి : సర్పంచ్

**హుస్నాబాద్, డిసెంబరు 23, ప్రభాతవార్త:** రైతులు సాగుచేసే పంటలకు క్రిమిసంహారక మందుల బదులు కంపోస్టు ఎరువులు వాడాలని సర్పంచ్ తోడేటి రమేష్ అన్నారు. శనివారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మండలంలోని పందిల్ల గ్రామంలో గల రైతు వేదికలో దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సర్పంచ్ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట పొలాలలో క్రిమిసంహారక మందులు వాడడం వల్ల కలిగే అనర్థాలను గురించి వివరించారు. దేశ్‌పాండే ఫౌండేషన్ వారు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రైతులకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లు సైతం అందించడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు



క్రైస్తవులకు క్రిస్మన్ కానుకలు అందచేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, డిసెంబరు 23, ప్రభాతవార్త:** ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, ఆర్‌డిఓ కే వెంకారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రైస్తవులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఒకరి మతాలను ఒకరు గౌరవించుకుంటూ కలిసి మెలిసి పండగలు జరుపుకుంటే సమాజంలో శాంతి భద్రతలకు కొదవ ఉండదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పరంగా పేదలైన క్రైస్తవులకు క్రిస్మిస్ కానుకలను అందచేశారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, జడ్పీటిసి నాగిశెట్టి రాథోడ్, వినిలా నరేష్, ఎంపిపి ఉపాధ్యక్షులు రాములు, ఇప్పేపల్లి సొసైటీ చైర్మన్ మచ్చేందర్, అల్లిపూర్ సెంట్రల్ చర్చ్ డిఎస జాన్‌వెస్లి, నాయకులు అనంత నవీన్, ఇజ్రాయిల్ బాబి, మాణిక్యమ్మ, శివప్ప, బండి మోహన్, ఆర్ నరసింహులు, పాస్టర్ రవికుమార్, జైపాల్ తదితరులు పాల్నొరు.

**నవభారత్ పాఠశాలలో...**

**హుస్నాబాద్, డిసెంబరు 23, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లోని నవభారత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు కరస్పాండెంట్ గంగరవేని రవి, డైరెక్టర్ వేల్పుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భక్తిగీతాలకు నృత్యాలు చేశారు. అనంతరం సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచ మానవాళి సంతోషంగా ఉండాలని యేసుక్రీస్తు బలయ్యారని,ఆయన చూపిన శాంతి మార్గంలోనే విద్యార్థులు నడవాలన్నారు.అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వినీష్‌కుమార్,పాఠవాల ఇంచార్జీ జయతో పాటు అధ్యాపకబృధం పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, డిసెంబర్ 23 (ప్రభాతవార్త):** మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన చిన్నబోయిని శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ బిసిసెల్ మండల అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల కనకయ్య శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట చిన్నబోయిని మల్లేష్, కృష్ణ, చెక్కల రమేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

**మనూర్, డిసెంబరు 23, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ వసతి గృహం విద్యార్థులకు శనివారం దుప్పట్లు, స్వెటర్లు, క్యాపులను పంపిణీ చేశారు. వసతి గృహం వార్డెన్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో సాగిన పంపిణి కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా వాటిని చలి తీవ్రత అధికంగా ఉందని అందుకు విద్యార్థులు చల్లిని తట్టుకునేందుకు దుప్పట్లు, స్వెటర్లు, క్యాపులు పంపిణి చేసినట్లు వార్డెన్ రాజిరెడ్డి వివరించారు.

## సంక్షేమ పథకాలను కొనసాగించాలి : ఎమ్మెల్యే

**మిరుదొడ్డి, డిసెంబర్ 23, ప్రభాతవార్త :** గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను కొనసాగించాలని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీ మూబారక్ చెక్కులతో పాటు ఇల్లు కూలిన బాధితులకు చెక్కులను అయన ఎంపిపి సాయిలు, జడ్పీటిసి లక్ష్మీ, పిఎసిఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బక్కి వెంకటయ్యతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మీ, షాదీ మూబారక్, రైతుబంధు, రైతు బీమా లాంటి పథకాలను చేపట్టిందని వాటిని కొనసాగించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు వల్లాల సత్యానారాయణ, తోట అంజిరెడ్డి, పోలీసు రాజులు, రంగమైన రాములు,తుమ్మల బాలరాజు, కిష్టయ్య,సుతారి నర్సింలు, లక్ష్మీ, రాజిరెడ్డి, గొట్టం రాధాకృష్ణ, సాన యాదగిరి పాల్గొన్నారు.

# వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

**గజ్వేల్, డిసెంబర్ 23 (ప్రభాతవార్త):** పట్టణంలోని శ్రీవెంకటేశ్వరాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేయడంతో పాటు పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. గజ్వేల్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల భక్తులు ఉదయం నుండే స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ గావించారు. అలాగే వెంకటేశ్వరాలయ కమిటీ మహిళ సభ్యులు కోలాటం ఆడగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారింది. ఇదిలా ఉండగా శ్రీవెంకటేశ్వరస్వామిని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, గజ్వేల్ సిఐ జాన్‌రెడ్డితో పాటు స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బుక్క రమేష్, అర్చకులు శేషం శ్రీనివాసచార్యులు ప్రముఖులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా సుమారు 20వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లుచేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు సేవకులు పాల్గొన్నారు.

**పుల్కల్ మండలంలో...**

**పుల్కల్, డిసెంబరు 23, ప్రభాతవార్త:** మార్గశిర మాసం శుక్లపక్షం ఏకాదశిని (వైకుంఠ ఏకదశి) ని పురస్కరించుకుని మండలంలోని ఆయా ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఉమ్మడి మండలంలోని వెండికోల్, సింగూరు, శివంపేట గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలకు చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అర్చకులు ఆశీర్వచనాలు చేశారు.



సిద్దిపేటలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర క్షేత్రంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**శ్రీకళ్యాణ వెంకటేశ్వర క్షేత్రంలో...**

**వర్గల్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:** ప్రసిద్ధ వర్గల్ శ్రీ కళ్యాణ వెంకటేశ్వర క్షేత్రంలో శనివారం ముక్కోటి ఏకాదశి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో పండితులు ఈ మహోత్సవానికి అంకురార్పణ చేయగా అనంతరం సతీసమేతులైన శ్రీస్వామివారికి విశేష పంచామృతాభిషేకం, లక్ష తులసి అర్చన, ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ, ఉత్తర ద్వార దర్శనం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ ఈ పర్వదినాన్ని వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, మోక్షదా ఏకాదశి అని అంటారని తెలిపారు. అత్యంత పవిత్రమైన ఈ రోజు స్వామి వారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకుంటే సర్వ సంపదలు, మోక్షప్రాప్తి లభిస్తుందన్నారు. కాగా ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా వాసు గ్రూప్స్ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా అధ్వర్యంలో రూ. 3లక్షల 50 వేల విలువ చేసే వెండి తొడుగులను అలయ నిర్వాహకులకు అందజేశారు.



గజ్వేల్‌లోని ఆలయంలో కోలాటం ఆడుతున్న మహిళలు

**కొండపాక మండలంలో...**

**కొండపాక, డిసెంబర్ 23, ప్రభాతవార్త**

కుకునూరుపల్లి, కొండపాక మండలాల్లోని దేవాలయాల్లో శుక్రవారం దనర్మాసోత్సవాల్లో భాగంగా ముక్కోటీ ఏకదశి సందర్భంగా దుద్దెడలోని వెంకటేశ్వరాలయం, సంతాన మల్లికార్జున స్వామి, రుద్రేశ్వరాలయం, అనంద నిలయంలోని వెంకటేశ్వర స్వామి అలయంలో, కుకునూరుపల్లి రామాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు భక్తులు దేవాలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు.

